


కథ

దూశి గురునాధరావు

# ఆడపిల్ల-దుఖ

"పోస్ట్"

పేపరు చదువుతూ కుర్చీలో కూర్చున్న భూపాలరావు, పోస్టుమేన్ కేక విని, లేచి బయటకు వచ్చాడు. పోస్టుమేన్ ఆయనకు ఓ రిజిష్టర్డ్ కవరు అందించాడు. అది అతని కూతురు వేదవతి పంపిన లాయరు నోటీసు.

సంతకం చేసి కవరు తీసుకుని లోనికి వచ్చి కుర్చీలో మరలా కూర్చున్నాడు భూపాలరావు. కూతురు వేదవతి అన్నంత పని చేసింది. నెల రోజుల క్రితం జరిగిన సంఘటనలు అతనికి గుర్తుకు వచ్చాయి.

భూపాలరావు తమ పూర్వీకుల నుండి వచ్చిన ఆస్తిని తన ముగ్గురు కొడుకులకు సమానంగా పంచాలని, కొడుకులను, కోడళ్లను, భార్యను అందర్నీ సమావేశపరిచాడు. సరిగ్గా అదే సమయంలో అతని ఒక్కగానొక్క కూతురు అనుకోకుండా ఊడిపడింది. తనకు కూడా సమాన భాగం కావాలని అంది.

చక్కగా పెళ్లి చేసి కట్నాలు కానుకలతో సహా అత్తవారింటికి పంపించాం గనుక వేదవతికి భాగం రాదని అందరూ కలసి ఆమె మీదకు దాడి చేశారు. అయినా తన భాగం తనకు ఇవ్వాలని పట్టుబట్టింది. ఆడపిల్ల కనుక పసుపు కుంకుమల క్రింద కొంత పైకం, బంగారం ఇద్దామనుకున్నా, వేదవతి ఆస్తిలో భాగం కోసం పట్టుబట్టడంతో, ఒక్క రూపాయి కూడా ఇవ్వనని చెప్పేశాడు భూపాలరావు. తన వాటా ఆస్తి కోర్టు ద్వారా రాబట్టుకుంటానని చెప్పి వెళ్లిపోయింది వేదవతి.

భూపాలరావు కోసం కట్టలు తెచ్చుకుంది లాయరు నోటీసు చూశాక. "ఏమేవ్" అని గట్టిగా కేక వేశాడు.

ఎందుకలా అరిచారో, ఏం కొంప మునిగిందో అనుకుంటూ అనసూయమ్మ వంటగదిలో నుంచి పరుగు పరుగున వచ్చింది.

"చూశావా నీ కూతురు నిర్వాకం. ఆస్తి కోసం లాయరు నోటీసు పంపింది. పదిహేను రోజుల లోగా ఏ సంగతి తేల్చకపోతే కోర్టు ద్వారా తేల్చుకుంటుందట. ఎంత బరి తెగించింది."

అనసూయమ్మకు అర్థమైంది అతనలా ఎందుకు కేక వేశాడో. వేదవతి చేసిన పనికి కోపంగా ఉన్నా, అనసూయమ్మకు కూతురుపై ఏదో మూల అభిమానం. ఆ అభిమానంతోనే "పోనీ అది అడిగినట్లు ఇచ్చేయరాదా!" అంది.

"చిల్లి గవ్వ కూడా ఇవ్వను. తండ్రి అని కూడా గౌరవం లేకుండా లాయరు నోటీసు పంపిస్తుందా!" అన్నాడు భూపాలరావు.

అనసూయమ్మ భర్తకు మంచినీళ్లు అందించింది. మంచినీళ్లు తాగాక కొంచెం శాంతించాడు భూపాలరావు. కొడుకులు ముగ్గురితోను, ముఖ్యంగా పట్నం లోనున్న లాయరును సంప్రదించి ఏం చేయాలో ఒక నిర్ణయానికి రావచ్చు అనుకున్నాడు.

* * *

భూపాలరావు కొడుకులు ముగ్గురితో హాలులో సమావేశమయ్యాడు. ముగ్గురు కోడళ్లు గది గుమ్మం దగ్గర నిల్చుని ఉన్నారు. అనసూయమ్మ వంటింట్లో ఉంది.

"మీ అత్తగారిని పిలిచి మీరు కూడా ఇక్కడకు వచ్చి కూర్చోండి. ఇది అతి ముఖ్యమైన విషయం. అందరం కలసి చర్చించి ఓ నిర్ణయానికి రావాలి" అన్నాడు భూపాలరావు.

అందరూ వచ్చాక, భూపాలరావు ఏదో చెప్పబోయాడు. ఇంతలో అతని పెద్దకొడుకు అన్నాడు. "నాన్నా! చెల్లికి ఇవ్వవలసినదంతా ఇచ్చాం. దాని బెదిరింపులకు లొంగవద్దు"

"అవును నాన్నా! ఇది బావ ఆడిస్తున్న నాటకమై ఉంటుంది. చెల్లికి అంత ధైర్యం లేదు" భూపాలరావు రెండవ కొడుకు తన అన్నకు వంతపాడాడు.

"అక్కకు ఘనంగా పెళ్లిచేశాం. కట్నాలు కానుకలతో అత్తవారింటికి పంపాం. పెళ్లికి, కట్నకానుకలకు చాలానే ఖర్చయింది కదా! ఆ విధంగా ఆమె వాటా ఆమెకు ఇచ్చినట్లే లెఖ్క. అంతగా పట్టుబడితే కొద్దిగా పైకం, బంగారం ఇస్తే సరి" భూపాలరావు మూడవ కొడుకు అన్నాడు. అతను వేదవతి తరువాతి వాడు.

అనసూయమ్మకు కూతురు చేసిన పని నచ్చకున్నా, తన కొడుకులు ఈ విధంగా చర్చించడం ఆమెకు నచ్చలేదు. ఇందుకు కారణం కూతురు మీద ఏ మూలనో నున్న అభిమానం కావచ్చు. ఆమె తన వంతుగా అంది.

"మీ అందరికీ పెద్ద చదువులు చదివించారు. ఉద్యోగాలు వచ్చేవరకు మీ నాన్నగారే మిమ్మల్ని పోషించారు. మీ పెళ్లిళ్లకు కూడా ఖర్చయింది. మీరు తెచ్చుకున్న కట్నకానుకలు మీ దగ్గరే ఉన్నాయి. మరి ఈ ఖర్చులన్నీ మీ మీ ఆస్తులలో భాగమనుకోవాలా?" అనసూయమ్మ గొంతులో ఏదో ఆవేదన.

ఆమె ఇంకా ఇలా అంది.


"ఏది ఏమైనా అది మీ అక్కచెల్లెలు. మీ తోడబుట్టినది. కోర్టులంటూ తిరిగి వీధిన పడేకంటే, వేదవతితో రాజీపడి ఏదో విధంగా ఈ వ్యవహారం ముగిసినట్లు చేయండి"

అందరూ అనసూయమ్మను గుడ్లురిమి చూశారు. వేదవతితో రాజీపడి ఆస్తిలో భాగం ఆమెకు ఇవ్వడం వాళ్లకు ఎంతమాత్రం ఇష్టం లేదు.

అయితే భూపాలరావు మాత్రం మౌనంగా అందరి మాటలు విన్నాడు. చివరకు ఇలా అన్నాడు.

"నేను పట్నంలోనున్న మంచి లాయరుని సంప్రదించాను. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం, ఆస్తిపై కొడుకులతో సహా కూతుళ్లకు కూడా సమాన హక్కు ఉంటుందని చెప్పాడు. అందువల్ల ఈ విషయంలో మనం కోర్టులంట తిరిగినా ఏమీ ప్రయోజనం ఉండదు" ఒక్క క్షణం ఆగాడు భూపాలరావు.

కొడుకులు, కోడళ్లు అందరి ముఖాల్లో కత్తివాటుకు నెత్తురు చుక్క లేదు. వారందరూ ఒక విధమైన



షాక్‌కి గురయ్యారు.

"మనం వేదవతితో రాజీ పడడం తప్ప ఇంకో మార్గం లేదు. ఆమెను పిలిచి అందరికీ సమానంగా ఆస్తి పంచాలని నేనొక నిర్ణయానికి వచ్చాను. అది చెపుదామనే మీ అందరినీ ఇక్కడ సమావేశపరిచాను" అన్నాడు భూపాలరావు.

* * *

ఆస్తి పంపకం సజావుగా జరగడానికి లాయరును పిలిచాడు భూపాలరావు. వేదవతి, భర్త ప్రకాశంతో సహా వచ్చింది.

అందరి సంతకాలతో, ఆస్తిని కొడుకులకు కూతురికి సమానంగా పంచి రిజిష్టరు చేయించాడు భూపాలరావు.

నాలుగు ఎకరాల మాగాణి, పదిహేను చెట్లున్న కొబ్బరితోట, ప్రస్తుతం భూపాలరావు ఇంటిపక్కనే ఉన్న రెండు వందల గజాల స్థలం, దానిలో నున్న రెండు గదుల చిన్న ఇల్లు... ఇవి వేదవతి వంతుకు వచ్చాయి.

* * *

వేదవతికి ఆస్తి రావడంతో ఆమె భర్త ప్రకాశం పూర్తిగా మారిపోయాడు.

"సారీ వేదవతి! ఇన్నాళ్లూ నిన్ను మాటలతో వేధించాను. నీలో ఇంత పట్టుదల ఉంటుందని అనుకోలేదు. మొత్తంమీద సాధించావు" అన్నాడు ప్రకాశం.

"నా ఈ పట్టుదలకు మీరే కారణం" అంది వేదవతి గుంభనంగా. అవును మరి. తనకంటూ స్వంత సంపాదన లేదు. ఆడపిల్లలకు చదువు ఎందుకు అని పుట్టింటివారు చదివించలేదు. చేతిలో నాలుగు డబ్బులు ఎప్పుడూ ఉండేవి కావు. చిన్నవి, పెద్దవి అన్ని ఖర్చులు భర్తే పెట్టేవాడు. "ఇవి నీ ఖర్చులకు ఉంచు" అని భర్త ఏనాడూ తనకు ఇవ్వలేదు. తన పుట్టింటివారు కూడా ఏనాడూ ఇది ఉంచు" అని ఒక రూపాయి కూడా ఇవ్వలేదు. వీటన్నింటి వల్ల వేదవతిలో ఓ రకమైన కసి ఏర్పడి ఆస్తిలో వాటా కోసం పట్టుదల పెరిగింది.

"నా పేర వచ్చిన ఆస్తిని నిలుపుకోవాలి. అభివృద్ధి చేయాలి. తరువాత మన పిల్లలకు అందించాలి" అంది వేదవతి.

"అలాగే చేద్దాం. నీవెలా చేసినా నేను ఎదురు చెప్పను. నీ తెలివితేటలు మీద నాకు నమ్మకం కుదిరింది. మన సంసారం గడవడానికి నా సంపాదన సరిపోతుంది" అన్నాడు ప్రకాశం.

"ఏమండీ! మీ తమ్ముడు ప్రభాకరం, నా కన్నవారి ఊరిలో నాకు భాగంగా వచ్చిన ఇంట్లో ఉంటూ నా వాటాగా వచ్చిన ఆస్తిని చూడగలడా?" అంది వేదవతి.

"నిజమే. వాడికి ఈమధ్యే పెళ్లి కూడా అయింది కదా! పనీపాట లేక మా ఊరిలో ఊరికే తిరుగుతున్నాడు. నువ్వు చెప్పినట్లు చేస్తే, వాడికి ఓ వ్యాపకం దొరికినట్లవుతుంది. మా నాన్న మీద భారం పెట్టకుండా వేరే కాపురం పెట్టినట్లవుతుంది కూడా. నీ ఐడియా బాగుంది. ప్రభాకరం వ్యవసాయం చేయడంలో దిట్ట కూడా. ఈ రోజే వాడితో మాట్లాడతాను" అన్నాడు ప్రకాశం.

* * *

ప్రకాశం తమ్ముడు ప్రభాకరం, భార్యతో సహా వేదవతి కన్నవారి ఊర్లో వేదవతికి చెందిన ఇంట్లో మకాం పెట్టాడు.

ప్రభాకరం స్వతహాగా మంచివాడు. ఎవరితోనూ గొడవ పడడం అతనికి ఇష్టం ఉండదు. పైగా పరోపకారి. అతని భార్య కూడా అతనికి చేదోడు వాదోడుగా ఉంటుంది.

ఊరిపెద్దలకు ప్రభాకరాన్ని పరిచయం చేసింది వేదవతి. తన ఆస్తి వ్యవహారాలన్నీ అతను చూస్తాడని, తను అప్పుడప్పుడు వస్తూంటానని చెప్పింది.

కొద్దికాలంలోనే ప్రభాకరం ఒక మంచి వ్యక్తిగా ఊరివారి మన్ననలు పొందాడు. విచిత్రంగా భూపాలరావుకు కుడిభుజమైపోయాడు.

భూపాలరావు కొడుకులు ముగ్గురూ పట్నంలో ఉంటూ అప్పుడప్పుడు ఈ ఊరు వచ్చి తల్లిదండ్రులను పలుకరించి వెళ్తున్నారు. అయితే ప్రభాకరం భూపాలరావు ఇంటి పక్కనే ఉండడంతో అతను భూపాలరావు పనులకు సాయమందిస్తూండడం వల్ల ఆ రెండు కుటుంబాలు బాగా చేరువయ్యాయి.

ఓ రోజు అనసూయమ్మకు అకస్మాత్తుగా పక్షవాతం రావడంతో, పెరట్లో నూతివద్ద కూలబడిపోయింది. ఆ సమయానికి ప్రభాకరం, అతని భార్య అక్కడ ఉన్నారు. అనసూయమ్మను ఇంటిలోనికి తెచ్చి మంచంపై పడుకోబెట్టారు. ప్రభాకరం వెంటవెంటనే అందరికీ ఈ వార్త అందించాడు. వదిన వేదవతికి కూడా కబురందించాడు.

పొలం పనిలో ఉన్న భూపాలరావు పరుగుపరుగున ఇల్లు చేరాడు. ఈలోగా ఊర్లోనున్న ఆయుర్వేద వైద్యుడిని వెంటబెట్టుకు వచ్చాడు ప్రభాకరం.

అనసూయమ్మకు నోరు, ఒక చేయి, ఒక కాలు వంకరబోయాయి. నోట మాట రాలేదు. వైద్యుడు ఏవో పసరులు, మందులు ఆమె నోట్లో వేశాడు. ఈ వ్యాధి నయమవ్వడానికి సమయం పడుతుందని, కావల్సిన మందులు పట్నం నుంచి తెచ్చిన వెంటనే చికిత్స ప్రారంభిస్తానని చెప్పి, వైద్యుడు వెళ్లిపోయాడు.

కబురు తెలిసిన వెంటనే ముగ్గురు కొడుకులు, కోడళ్లు వచ్చారు. వేదవతి కూడా వచ్చింది. కానీ ఆమె ఉండడం తన సొంత ఇంట్లోనే.

రాత్రి భోజనాలయ్యాక, భూపాలరావు పెద్ద కొడుకు అన్నాడు. "అమ్మను చూసుకోడానికి ఒక ఆడ మనిషిని నెల జీతాకని పెడదాం. మన వైద్యుడు చేయబోయే ఆయుర్వేద చికిత్సతో నయమవుతుందనే అనుకుంటున్నాను" అన్నాడు.

"పెద్దన్నయ్యా! నువ్వు డాక్టరువి కదా! పెరాలసిస్ నయం చేయడానికి కొత్తకొత్త వైద్యవిధానాలు వచ్చాయి కదా! అమ్మను మీ ఇంట్లో పెట్టుకుని చికిత్స చేయించలేవా?" అంది వేదవతి.

పెద్ద వదిన వేదవతి వంక గుర్రుగా చూసింది. "మీ అన్నయ్య ఉదయం అనగా వెళ్లి ఏ అర్ధరాత్రో ఇంటికి వస్తారు. నేనొక్కర్తినే మీ అమ్మకు సేవ చేయడం నా తరం కాదు" కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది.

అత్తగారిని తమ ఇంట్లో ఉంచుకోమంటారేమోనని చిన్న వదిన ముందే ముందరికాళ్లకు బంధం వేసే విధంగా అంది వేదవతితో.

"ఆస్తిలో వాటా తీసుకున్నావుగా. మీ అమ్మను నీ దగ్గర ఉంచుకోలేవా?" అంది.

భూపాలరావు మౌనంగా వారి మాటలు వింటున్నాడు. కొడుకులంటే అతనికి ప్రాణం. మంచి గుణగణాలు, ఆస్తిపాస్తులు చూసి కోడళ్లను ఎంచి, కొడుకులకు పెళ్లిళ్లు చేశాడు. ఇప్పుడు కొడుకులెవరూ తల్లిని తమతో తీసుకుని వెళ్తామని ఒక్కడు ముందుకు రాలేదు. కోడళ్ల వంతపాడేటట్టున్నారు.

వేదవతి వదినల మాటలకు చాలా నొచ్చుకుంది. అన్నయ్యలపై కోపం వచ్చింది.

"ఆమె నా కన్నతల్లి. కన్నబిడ్డలు తల్లిదండ్రుల బాగోగులు చూడడానికి, ఆస్తిహక్కులకునూ సంబంధం లేదు. నాకు ఆస్తిలో వాటా వచ్చినా రాకపోయినా, కన్న బిడ్డగా తల్లిదండ్రుల బాధ్యత నా పై ఉంది" అంది వేదవతి.

"అమ్మను పట్నంలో మాతో



## అస్సలు టచ్‌లో లేను

గతంలో షాహిద్ కపూర్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన కరీనా కపూర్ అతనికి దూరమయ్యాక సైఫ్ అలీఖాన్‌కి దగ్గరైంది. షాహిద్-కరీనా కలిసి ప్రస్తుతం ఏ సినిమాలోనూ నటించడంలేదు. కనీసం ఎదురుపడినప్పుడు విష్ చేస్కుంటున్నారా? అని ఓ ఆసామీ అడిగాడు కరీనాని. 'నేను షాహిద్‌తో ఫ్రెండ్షిప్‌తో వున్నప్పుడు గడిపిన సమయం నిజంగా మధురమైనది. అయితే మేమిద్దరం అస్సలు టచ్‌లో లేను. ఎప్పుడైనా అతను ఎదురుపడితే పలకరించడానికి నేనేమీ ఇబ్బంది ఫీల్ కాను' అంటోంది కరీనా.

ఉంచుకుని వైద్యం చేయించాలంటే అందరికీ కష్టమే. అన్నయ్య చెప్పినట్లు అమ్మకు ఇక్కడే వైద్యం చేయించి కొన్నాళ్లు చూద్దాం. నయం కాకపోతే అప్పుడు ఇంకేదైనా నిర్ణయం తీసుకోవచ్చు" అన్నాడు వేదవతి చిన్నన్నయ్య.

అలా చేయడమే ప్రస్తుతం అందరికీ మంచిదని కొడుకులు, కోడళ్లు ఓ నిర్ణయానికి వచ్చేశారు.

భూపాలరావు మౌనం వీడలేదు. మీ ఉద్దేశ్యం ఏమిటని ఎవరూ అతనిని అడగలేదు. అతనికి తన పరిస్థితి అర్థమైంది. పిల్లలకు పెళ్లిళ్లు కాగానే స్వేచ్ఛాజీవులయిపోయారు. ఆస్తి పంపకాలతో పూర్తిగా రెక్కలు వచ్చి ఎగిరిపోయారు. ఇప్పుడు ఎవరి జీవితం వారిది. తన కొడుకులు ఇలా ప్రవర్తిస్తారని కలలో కూడా అనుకోలేదు. కొడుకులు పున్నామనరకం నుండి తప్పించేవారని, కూతురు గుండెల మీద కుంపటి అని అనుకుని వేదవతిని చిన్నచూపు చూశాడు తను. వేదవతి చిన్నతనం నుండి ఎన్నో విషయాల్లో ఆమెకు తను చేసిన అన్యాయం సినిమా రీళ్లలా కదిలాయి భూపాలరావు మనసులో. ఈ ఆలోచనలతోనే చిన్న మగత నిద్రలోనికి జారుకున్నాడు భూపాలరావు. తెలివి రాగానే చూస్తే ఆ గదిలో తన కొడుకులు కోడళ్లు ఎవరూ లేరు. వేదవతి మాత్రం అనసూయమ్మ మంచం పక్కన కూర్చుని ఉంది.

* * *


అనసూయమ్మకు పరిచర్యలు చేయడానికి ఓ ఆడమనిషిని నియమించారు. వైద్యుడు రోజూ ఉదయం సాయంత్రం అనసూయమ్మకు మందు ఇవ్వడానికి వస్తానని చెప్పాడు. కొడుకులు కోడళ్లు ఎవరి మానాన వారు పట్నం వెళ్లిపోయారు.

వేదవతి రెండు రోజులు తల్లితో గడిపి పట్నం వెళ్తూ ప్రభాకరంతో అంది.

"ప్రభాకరం! మా నాన్నను అమ్మను నీ చేతులలో పెడుతున్నాను" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

మరో వారంలో తిరిగి వస్తానని చెప్పి పట్నం వెళ్లిపోయింది వేదవతి.

పట్నం వెళ్లిందే గానీ, వేదవతికి మనసు మనసులో లేదు. పరిస్థితులన్నీ వివరంగా భర్త ప్రకాశంతో చర్చించింది. ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తన సహాయం ఉంటుందని ప్రకాశం వేదవతితో అన్నాడు. ఇద్దరూ తమకు తెలిసిన డాక్టరును సంప్రదించారు. అనసూయమ్మకు తప్పక నయం అవుతుందని, తగిన మందులు ఇస్తూ ఫిజియోథెరపీ చేస్తే ఆమె తిరిగి తన పనులు తను చేసుకోగలదని డాక్టరు చెప్పాడు.



క్షణం ఆలస్యం చేయకుండా, తన భర్తను వెంట బెట్టుకుని తల్లి ముందు వాలింది వేదవతి. తండ్రిని ఒప్పించి తనతో తల్లిని పట్నం తీసుకుని వెళ్లింది. డాక్టరు చికిత్స ప్రారంభించాడు.

ఇంత జరిగిన తరువాతనైనా, తన కొడుకులకు విషయం తెలిసి కూడా రాలేదని భూపాలరావు చాలా బాధపడ్డాడు. ఆ పల్లెటూరులో ప్రభాకరం భూపాలరావుకు అండగా ఉన్నాడు. భూపాలరావు అప్పుడప్పుడు పట్నం వెళ్లి భార్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నాడు.

అనసూయమ్మ ఆరోగ్యం తెరిపిన పడింది. లేచి మెల్లగా నడవగలుస్తోంది. కొంచెం మాట్లాడగలుస్తోంది.

ఒకరోజు భూపాలరావు వేదవతితో అన్నాడు. "నీకు చాలా అన్యాయం చేశానమ్మా. కూతురుగా నిన్ను చిన్నచూపు చూశాను. మీ అన్నలేదో మమ్మల్ని ఉద్ధరిస్తారని వీరిపై పెట్టుకున్న ఆశ, బూడిదలో పోసిన పన్నీరయింది. చివరకు నా కళ్లు తెరుచుకున్నాయి. నన్ను క్షమించమ్మా!" ఒకింత ఉద్వేగంతో అన్నాడు. అతని కళ్లు చెమర్చాయి.

"అలా అనకండి నాన్నా! కొడుకుకైనా, కూతురుకైనా తల్లి తల్లే. ఆస్తిపాస్తులతో అనుబంధాలను ముడిపెట్టకూడదు. అమ్మ కోలుకుంటోంది. అదే పదివేలు. అన్నయ్యలు, తమ్ముడు మిమ్మల్ని చూడలేదని వారిపై నాకు కోపం లేదు. కానీ వారు బాధ్యతలు విస్మరించారని బాధగా ఉంది. కన్నబిడ్డగా నా బాధ్యత నేను నిర్వర్తిస్తున్నాను. అంతే!"

వేదవతి మాటలకు భూపాలరావు కళ్లంట నీళ్లు జలజల రాలాయి. ఆమెపై అభిమానం కట్టలుతెంచుకోగా ఆమెను గుండెలకు హత్తుకున్నాడు. ఆమె ఒకప్పుడు అతని గుండెల మీద కుంపటి కానీ ఇప్పుడు అతని గుండెల్లో గూడుకట్టుకుంది.

○

## అదీ సంగతి

ఇటీవల ఐశ్వర్యారాయ్ 36వ బర్త్‌డే జరిగిన సంగతి తెలుసు కదా! ఆరోజు అనుకోకుండా ఓ పత్రికా సమావేశంలో వున్న కత్రినా కైఫ్‌ని ఐష్‌కి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్తారా? అని ఓ విలేకరి అడిగితే- 'అసలా సంగతితో నాకేంటి సంబంధం?' అంటూ ఇన్‌డైరెక్టుగా గ్రీటింగ్స్ చెప్పకుండా తప్పించుకుంది కత్రినా. కారణం- గతంలో మంచి ఫ్రెండ్‌గా వున్న ఐష్ అంటే సల్మాన్‌ఖాన్‌కి ఏమాత్రం 'గిట్టదు' కాబట్టి ప్రస్తుతం సల్మాన్‌కి క్లోజ్‌గా వుంటున్న కత్రినా ఆ విషయం గ్రహించి ఇలా విషెస్ చెప్పను అందని ఎవరయినా అర్థం చేసుకోగలరు.